
గురువులు

# చ్యవన మహర్షి



ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్
www.freegurukul.org



సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజి
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస
అమ్మ శారదా దేవి
గురు వివేకానంద
గురు సాయిబాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళ స్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

Free Gurukul

"ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్" ద్వారా విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందించే సేవా కార్యక్రమంలో భాగంగా ఈ పుస్తకాన్ని తిరుమల తిరుపతి దేవస్థానం వెబ్ సైట్ నుంచి సేకరించి అందిస్తున్నాము. ఇందుకు మేము వారికి కృతజ్ఞత తెలియచేసుకుంటున్నాము.

సాయి రామ్ వారి సేవల విస్తరణలో భాగంగా ఈ ఫౌండేషన్ స్థాపించబడినది. ఈ స్వచ్ఛంద సంస్థ ద్వారానే అన్ని సేవలు అందించబడును. ఇటువంటి పుస్తకాలు మీరు వ్రాసినట్లయితే (లేక) సేకరిస్తే మాకు తెలియచేయండి. మేము ప్రతి విద్యార్థికి ఉచితంగా అందేలా చేస్తాము, తద్వారా ఉన్నత విలువలు, నైపుణ్యాలు కలిగిన విద్యార్థులను మన దేశానికి అందించవచ్చు. మాతో కలిసి నవ భారత నిర్మాణ కార్యక్రమంలో పనిచేయుటకు, భాగస్వామ్యం అగుటకు ఆసక్తి ఉంటే సంప్రదించగలరు.

ఈ గ్రంధాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) తిరుమల తిరుపతి దేవస్థానం వారి వెబ్ సైట్: http://ebooks.tirumala.org
2) ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ వెబ్ సైట్ : www.freegurukul.org
3) సాయి రామ్ వెబ్ సైట్ : https://sites.google.com/site/sairealattitudemanagement
4) మొబైల్ ఆప్: Free Gurukul

గమనిక: భక్తి,జ్ఞాన,ధర్మ ప్రచారార్థం ఉచితంగా eBook రూపంలో తిరుమల తిరుపతి దేవస్థానం వారి సహాయంతో ఇవ్వడం జరిగింది. ఇది లాభార్జన దృష్టిలేని ఉచిత సేవ. ఈ సేవలో అంతర్జాలంలోని(ఇంటర్నెట్) లైసెన్సు / కాపీరైటు అభ్యంతరాలు లేనివి అనుకొన్న పుస్తకాలను గ్రహించటం జరిగినది. అనుకోకుండా ఏవైనా అభ్యంతరకరమైనవి ఉన్నచో మాకు తెలుప మనవి, వాటిని తొలగించగలము అని మనవి చేసుకొంటున్నాము.

Website: www.freegurukul.org Mobile App: Free Gurukul email: support@freegurukul.org

Facebook: www.facebook.com/freegurukul Helpline/WhatsApp: 9042020123


" మన లక్ష్యం: విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య అనేది ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందరికి అందించబడాలి "

ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ – Free Gurukul Education Foundation

సర్వం పరమాత్మ పాద సమర్పణమస్తు

## TTD(తిరుమల తిరుపతి దేవస్థానం)

## http://ebooks.tirumala.org



# అతి విశిష్టం ఈ దానం!

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్న్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.



రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, జవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

# వ్యసనముక్తి

శ్రీ ఎం. కొండమాచార్యులు

తిరుమల తిరుపతి దేవస్థానములు
తిరుపతి

వేదకథాభారతి - 16

# చ్యవనమహర్షి

రచన

శ్రీ ఎమ్. కొండమాచార్యులు

ప్రధాన సంపాదకుడు

ప్రొఫెసర్ ఎస్. బి. రఘునాథాచార్య

ప్రచురణ

డాక్టర్ ఐ.వి. సుబ్బారావు, ఐ. ఏ. ఎస్.,

కార్యనిర్వహణాధికారి

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి

1999

VEDAKATHĀ BHĀRATI - 16

CYAVANA MAHARSHI

by

***Sri M. Kondamacharyulu***

Chief Editor

***Professor S. B. Raghunathacharya***

First edition 1999

Copies : 10,000

Published by :

***Dr. I.V. Subba Rao, I.A.S.,***
Executive Officer
Tirumala Tirupati Devasthanams
Tirupati

Price :

*Lasertypeset at*
**ANNAPURNA GRAPHICS**
53, (Upstairs) R.S. Gardens, Tirupati ✆ : 30184

*Printed at*
**MUDRICA OFFSET PRINTERS**
Sanyasiraju St., Gandhi Nagar
Vijayawada ✆ : 579654

# మామాట

**డాక్టర్ ఐ.వి. సుబ్బారావు,** ఐ.ఏ.ఎస్.,
కార్యనిర్వహణాధికారి
తిరుమల తిరుపతి దేవస్థానములు
తిరుపతి

నిత్య సత్యమైన ప్రమాణాలు వేదాలు. మానవజాతి మనుగడకు అడుగడుగునా మార్గదర్శనం చేస్తూ నిస్స్వార్థ బుద్ధితో, త్యాగమయమైన ప్రవృత్తితో తమ తమ జీవితాలను పండించుకున్న ఎందరో మహానుభావుల జీవన వైభవాలు మనకు వేద వాఙ్మయంలో దర్శనమిస్తున్నాయి.

''ఆహా! ఎటువంటి కర్తవ్యదీక్ష! ఎంత విశాలదృష్టి! ఎటువంటి విశ్వకల్యాణభావన! ఎంతటి ధార్మిక చేతన!'' అని మనల్ని ఆశ్చర్యపరిచే జీవనవేదం మనకీ వాఙ్మయంలో ప్రత్యక్షమౌతుంది. ఆ వేదనాదాన్ని ఇంటింటా వినిపించాలనే మా ఆకాంక్షకు ప్రతిరూపమే -

**ఈ వేద కథా భారతి.**


వేదకథాభారతిలోని ఎనలేని మానవత్వపు విలువలు ఈ తరాన్ని ప్రభావితం చేయగలిగితే అంతకంటే మాకు ఆనందమేముంటుంది ?

ఈ కథాపుష్పాలను సంపాదించి తీర్చి దిద్ది అందమైన మాలగా రూపొందించిన ప్రొఫెసర్ ఎస్.బి. రఘునాథాచార్య గారిని మనసార అభినందిస్తున్నాను.

ఇంత చక్కగా ముద్రించిన అన్నపూర్ణ గ్రాఫిక్స్ వారికి అభినందనలు.

జయతు జయతు భారతీ

వేద కథా భారతీ



# మనవి

వేద కథాభారతి.

అంతశ్శత్రువులను అణచివేసి కొన్ని ఆదర్శాలకు, విలువలకు పట్టంకట్టి, ధార్మిక జీవనానికి ప్రాణంపోస్తూ ఈ లోకంలోనే కాక ఇతరలోకాల వారికి కూడా విండైన మానవత్వమంటే 'ఇది' అని ఆచరణ పూర్వకంగా నిరూపిస్తూ, అందులోని మధురిమలను చవిచూపిస్తూ వేదనాదవిభాసురమైన ఒక జీవన స్రవంతి ఈ గడ్డపై వెల్లివిరిసింది.

జలజలసాగే ఆ అమృత వాహిని వసుంధరను రసమయం చేసింది. సస్యశ్యామలం చేసింది. సుగంధపరిమళాలను వెదజల్లే నందనోద్యానాలను వెలయించింది. మానవ సృష్టిలో అరుదైన ప్రమాణాలను కొన్నింటిని నిలబెట్టింది. వాటికి కాలదోషం లేదు. ఆనాటికి, ఈ నాటికి, ఏనాటికైనా మానవతకు గమ్యాన్ని, జీవానికి అర్థాన్ని పరమార్థాన్ని సాధించడంలో ఆ ప్రమాణాలు చరితార్థాలయినాయి. అలాంటి జీవన చిత్రాలకు పట్టిన అద్దమే ఈ వేదకథాభారతి.

ఒక్కసారి పరిశీలించండి ! ఆ చిత్రరామణీయకతను మంచిమనసుతో దర్శించండి ! వారి ఆత్మల ఔన్నత్యాన్ని వారి భావనల ఔచిత్యాన్ని మీరు తప్పక అభినందిస్తారు ! అవి మంచివని తోస్తే అనుసరించడానికి ప్రయత్నించండి ! ఆనందించండి !

ప్రమాథి - నిజజ్యేష్ఠ
బహుళ - సప్తమి
5-7-1999

ప్రొఫెసర్ ఎస్. బి. రఘునాథాచార్య



# చ్యవనమహర్షి

ఋగ్వేదసంహిత ప్రథమమండలంలోని 112 వ సూక్తంలో ఆరునుండి పదివరకు, 116 వ సూక్తంలో పదవ ఋక్కు, 117వ సూక్తంలో పదమూడవ ఋక్కు, 118 వ సూక్తంలో ఆరవ ఋక్కు, ఇంకా ఆ ఋగ్వేదసంహితలోనే పంచమ మండలంలోని 74 వ సూక్తంలో ఐదవ ఋక్కు, యజుర్వేదీయ శతపథబ్రాహ్మణంలోని 4-1-5, 13 మంత్రాలు - వీటిలో చ్యవనమహర్షి ప్రస్తావన వుంది. ఇంతేకాక వేదాలకు ఉపబృంహణాలైన ఇతిహాసపురాణాల్లో కూడ ఈ మహనీయుని చరిత్ర కనిపిస్తుంది. మహామహిమోపేతుడైన చ్యవన మహాముని జన్మ కర్మలు ఎలాంటివో కొంచెం తెల్సుకుందాం.

త్రిమూర్తులనే పరీక్షించిన మహానుభావుడు భృగుమహర్షి. ఆయన బ్రహ్మమానసపుత్రుడు. ప్రశస్తచరిత్రులైన భార్గవులందరికి ఈతడు మూలపురుషుడు. ఈతని వంశమునందే చ్యవనుడు, జమదగ్ని, శుక్రుడు, దధీచి, పరశురాముడు మున్నగు వారవతరించి లోకోద్ధారకులైనారు. భృగువంశకీర్తనం సకల దోషాపహం. సర్వశుభావహం.

**చ్యవముని జన్మవృత్తాంతం :**

భృగుమహర్షి కర్దమ ప్రజాపతి పుత్రిక ఖ్యాతి అనే కాంతను, ఉశన అనే వనితను, పులోమ అనే రమణిని వివాహమాడినాడు. వారిని పుత్రవతులొనర్చినాడు. భర్త అనుగ్రహంతో పులోమగర్భవతి అయింది. కడుపులోనున్న తన కోమలిని హోమకార్యానికిగా అగ్నిని రగులు కొల్పుమని ఆదేశించి మహర్షి స్నానార్థము నదికి వెళ్ళినాడు. పులోమ అగ్నిహోత్రగృహములో నుండగా పులోముడనే వింత రక్కసుడొకడు

అచటికి వచ్చి నిరుపమాన సౌందర్యరాశియగు పులోమను గాంచి కామం కన్నుల కెగదట్టగా ''అగ్నీ! ఈమె ఎవని భార్య? ఈమె పేరేమి? నిజం చెప్పుమని గద్దించాడు.

గర్భచ్యుతుడు కాబట్టి చ్యవనుడైనాడు :

అగ్నిహోత్రుడు అబద్ధమాడుటకూ, బ్రాహ్మణశాపమునకూ భయపడ్డాడు. శాపభయాన్ని ఎట్లైనా తొలగించుకోవచ్చుగాని, అసత్యమాడడం వల్ల కలిగే పాపభయాన్ని బాపుకోడానికి ఉపాయమేలేదు అని భావించాడు అనలుడు. అలా తలపోసి దైత్యుడితో అగ్నిదేవుడు ''ఈమె భృగుమహర్షి పత్ని; పేరు పులోమ; పరమ పతివ్రత'' అని సత్యమే వచించాడు. ఆమాటలు వినగానే పులోముడు ''పూర్వం నేనీమెను పత్నిగా వరించాను. అపుడీమె తల్లిదండ్రులు ఈమెను నాకియ్యక భృగువునకు కట్టబెట్టినారు. అదృష్టవశాన నేడీమె నాకంటబడింది. నేనిప్పుడీమెను భార్యగా గైకొంటాను'' అని రక్కసుడు వరాహరూపం ధరించి భయవిహ్వలయై ఆక్రోశిస్తున్న పులోమను ఎత్తుకొని పరుగెత్త నారంభించాడు. అపుడామె గర్భమందున్న శిశువు అలిగి గర్భం నుంచి వెలువడి రాక్షసుని చురచుర చూశాడు. గర్భచ్యుతుడైన ఆ బిడ్డడు వెయ్యిమంది సూర్యులు ఏకకాలంలో ఉదయించినట్లుగా దుస్సహ తేజంతో దీపిస్తున్నాడు. ప్రళయకాల పావకుడికైవడి ప్రజ్వరిల్లుతున్నాడు. కనులు మిరుమిట్లు గొలిపే ఆ బాలకుణ్ణే చూడగానే దానవుడు భస్మమై పోయాడు. పులోమ కుక్షిచ్యుతుడైనందున అతడు చ్యవన నామంతో విరాజిల్లినాడు.

నీవు సర్వభక్షకుడవుకమ్ము!

పులోమ భృగువంశ వర్ధనుడైన ఆ బాలుణ్ణే ఎత్తుకొని తన గృహం చేరింది. ఇల్లు చేరడానికి మునుపు ఆమె దైత్యుని బారిపడి ఏడుస్తూ

పోతుండగా ఆసాధ్వి బాష్పధారాప్రవాహం మహానదియై ఆశ్రమ సమీపంలో ప్రవహించటం చేత ఆనదికి ''వధూసర' అనే పేరు బ్రహ్మదేవుడు పెట్టినాడు. ఈ విషయమిట్లుండగా స్నానమునకై వెళ్ళిన భృగుమహర్షి స్నానమాచరించి ఆశ్రమానికి వచ్చి బాలసూర్యుని వలె వెలుగుతున్న బాలునెత్తుకొని మురిసిపోతున్న ధర్మపత్నిని చూశాడు. ఆమెపట్ల అసురుడొనర్చిన అపకారం విని ''దేవీ! ఆ రక్కసుడు నీవు పులోమ అని ఎలా తెలుసుకున్నాడు? ఎవరు చెప్పినారు? అని ప్రశ్నించగా పులోమ ''ప్రాణేశ్వరా! ఈ యగ్నిహోత్రుడే అసురునకు నేను పులోమ ననీ, భృగుపత్నిననీ చెప్పినాడు. వెంటనే వాడు భయంకర సూకరంగా మారి నన్నెత్తుకొని వేగంగా పరుగెత్తుచుండగా నేను ఆక్రందించాను. నా ఆక్రందనం విని గర్భచ్యుతుడై ఈ శిశువు తన శక్తితో దైత్యుని నిలువరించి బూడిదచేసి నన్ను రక్షించాడు'' అంటూ బాలుని చెక్కిలి ముద్దాడింది.

భృగుమహర్షికి అగ్నిమీద ఇంతింతనరాని ఆగ్రహం వచ్చింది. అతడు అతిరోషంతో '' ఓ వైశ్వానరా! నీవు పరమక్రూరుడివి. నా పత్ని పేరు చెప్పి ఇంతటి అనర్థానికి కారణమైనావు. కనుక సర్వభక్షకుడవు కమ్ము'' అని శపించాడు. అపుడగ్నిదేవుడు మునీశ్వరుని గాంచి ''మహర్షీ! ఇతరులు తనదగ్గరకు వచ్చి తనకు తెలిసిన విషయం చెప్పుమని అడిగినపుడు చెప్పనివాడూ, సత్యము చెప్పనివాడూ ఘోరనరకంలో కూలిపోతాడు. పులోముడు వచ్చి - 'ఆమె ఎవరో నిజం చెప్పు' మని నన్నడిగినాడు. నేను అసత్యభయానికి వెరచి ఈయమ్మ భృగుపత్నియని ఉన్నవిషయం చెప్పినాను. నేను సకలజగత్కర్మసాక్షినై యుండి అబద్ధమెలా చెప్పగలనో తమరే చెప్పండి. ఇది నిమిత్తంగా మీరు నాపై కోపించి శాపమిచ్చారు. నేనలిగి మీకు ప్రతిశాపం ఇవ్వలేను. మునీశ్వరా! బ్రాహ్మణులు కొట్టినా, తిట్టినా, కినుకతో మిక్కిలి పరుషములాడినా

వారు పూజ్యులే. ఇట్టి విప్రులకు ఎగ్గుచేసినవారు ఇహపరాలకు దూరమౌతారు. కనుక నేనెల్లప్పుడూ కినుక వహించను. భూసురపుంగవుడవు. నీవేమిచేసినా చెల్లుతుంది. లోకహితుడనైన నాకు శాపమిచ్చి లోకాలకు చెట్టచేశావు. అదెట్లంటివేని చెపుతాను విను విప్రసత్తములు నాయందు వేల్చిన హవ్యకవ్యాలు నామూలంగా దేవగణాలు, పితృగణాలు స్వీకరిస్తారు. అటువంటి నేను సర్వభక్షకుడనై అశుచినైతే క్రియలు నిలిచిపోతాయి. క్రియానివృత్తి కలిగితే లోకయాత్ర జరుగదు గదా!'' అని అగ్నిభట్టారకుడు సకలలోకవ్యాప్తమైన తన తేజస్సును ఉపసంహరించుకొన్నాడు. ఎపుడైతే అగ్నిదేవుడు తన తేజోమూర్తిని ఉపసంహరించుకొన్నాడో అపుడే త్రేతాగ్నులు తేజరిల్లనందున యజ్ఞయాగాది కర్మలు నిలిచిపోయాయి. ప్రాతస్సాయంకాలములందు బ్రాహ్మణులు అగ్నిహోత్రములందు సమర్పించు ఆహుతులు ఆగిపోయాయి. దేవతార్చనలో దీపధూపాదుల సమర్పణ లేకపోయింది. పిండప్రదానాదులైన పితృకార్యాలు విచ్ఛిన్నమైపోయాయి.

**నీవు పరిశుద్ధుడవే !**

త్రేతాగ్నులు తేజరిల్లనందున జనులు భయసంభ్రమాక్రాంత చిత్తాలతో మహామునీంద్రుల కడకు పరుగెత్తిపోయారు. మహామునీంద్రులు కదలి దేవతలకడకు వచ్చారు. అంతట వారూ, వీరూ ఏకమై భయంతో బ్రహ్మదగ్గర చేరారు. భృగుమహర్షి శాపంవల్ల అగ్ని భట్టారకుడు తన తేజస్సును ఉపసంహరించడం వల్ల లోకవ్యవహారమంతా తారుమారైనదని ఎరింగి బ్రహ్మదేవుడు అగ్నిదేవుణ్ణి రావించి ఇలా అన్నాడు. ''అయ్యా! నీవు ప్రాణిజాలమునకెల్ల నాథుడవు. చరాచరాత్మకమైన జగత్ప్రవృత్తికి కారణభూతుడవు. లోకాలను పావనం చేసేవాడవు నీవే. నీవే దేవతాముఖుడవు. దోషరహితమైన గుణాలు

కలవాడవు నీవే. ఇలాంటి నీకు భువన ప్రవర్తన పరాఙ్ముఖత్వం న్యాయం కాదు. భృగుమహాముని వచనం అమోఘం కనుక నీవు సర్వభక్షకుడవైనప్పటికీ పరిశుద్ధులలో మిక్కిలి పరిశుద్ధుడవై, పూజ్యుల్లో అగ్రపూజ్యుడవై, వేదచోదిత విధానాల్లో విప్రసహాయుడవై విలసిల్లుతూ భువనాలను నడపవలసింది'' అని అగ్నిదేవుణ్ణి ప్రార్థించి భృగుమహర్షి వచనం పరమేష్ఠి ప్రతిష్ఠాపించాడు.

**చ్యవముని తపస్సు :**

అటువంటి భృగుమహర్షికి పుత్రుడై చ్యవనుడు అమ్మ నాయనలకు అల్లారుముద్దుబిడ్డడై దినదినప్రవర్ధమానుడైనాడు. ఉపనయనానంతరం వేదవేదాంగాది సర్వవిద్యలు తండ్రి దగ్గర నేర్చి తగిన కాలంలో తపస్సు చేయడానికి తల్లిదండ్రుల అనుమతి పొందినాడు. అలా అనుజ్ఞ పొంది వైదూర్య పర్వతప్రాంతానికి వెళ్ళినాడు. అక్కడ పయోష్ణి అనే సరస్సుయొక్క తీరంలో పెక్కువేల సంవత్సరాలు వెక్కసమైన నియమంతో వీరాసనుడై అక్కజమైన తపము ఆచరించాడు. అతని శరీరం వల్మీకంతో కప్పబడింది. ఆ పుట్టును లతాగుల్మములు ఆవరించాయి. అందువల్ల అతని ఉనికి ఆ వనప్రదేశంలో ఎవ్వరికీ తెలియరాలేదు. ఇలా చాలా కాలం గడచి పోయింది.

**శర్యాతి మహారాజు చ్యవముని దర్శించుట :**

శర్యాతి అనే మహారాజు నాలుగువేల మంది భార్యలతో పయోష్ణి సరస్సులో జలకాలాడుటకు వచ్చాడు. సైన్యపరివృతుడై వచ్చిన ఆ రాజు అక్కడ గుడారాలు వేయించాడు. శర్యాతి కూతురు సుకన్య నవయౌవనాంగి. ఆమె తన సఖులతో ఆ వనప్రాంతంలో విహరిస్తూ చ్యవనమహర్షి ఉన్న పుట్ట దగ్గరకు వచ్చింది. సుకన్య ఆ పుట్ట కోమల మండి చ్యవనమహర్షి కళ్ళు మెరుగులు విరజిమ్ముతుండగా అవి మిణుగురు

బూచుల కాంతులు కాబోలునని, వాటిని చూడవలెనని మెఱుగుబోణి కాంక్షించింది. వెంటనే పుట్టను త్రవ్వించింది. నిమీలిత నయనాలతో నున్న చ్యవనుడు బయటపడినాడు. శల్యమాత్రావశిష్టుడైన ఆవృద్ధ మునీశ్వరుణ్ణి సుకన్యచూచి భయంతో ఆ తావు విడిచి చెలికత్తెలతో వెళ్ళిపోయింది. చ్యవనుడు శర్యాతి మహారాజు సేనకు మలమూత్రనిరోధ మగునట్లు చేశాడు. సైన్యం మూత్రపురీషవిసర్జనం లేక పొట్టలుబ్బి బాధపడుతుండగా '' ఇది తన సైన్యం చేసిన తప్పిదానికి ప్రతిఫలమని తలపోశాడు శర్యాతి. అందరినీ అడిగి చూశాడు. అందుకు కారణమేమో తెలియలేక చింతాక్రాంతుడై ఉండినాడు. అట్లు విచారగ్రస్తుడై యున్న తండ్రిదగ్గరకు సుకన్య వచ్చి ''జనకా! మిణుగురుల వలె మెరుస్తూ రెండు మెఱుగులు వనంలో ఒక పుట్ట కోమలనుంచి కనిపిస్తుండగా చూశాను. అవేమో చూడాలని ఆసక్తితో ఆ పుట్టను త్రవ్వించాను. కాని అందులో ఆమెఱుగులేవీ కనిపించలేదు. కండ్లు మూసుకొని అస్థిపంజరంవలె నున్న ఒక వృద్ధముని దేహం కనిపించింది. నేను భయపడి అక్కడనుండి మరలివచ్చాను. సైన్యనిరోధమునకు నేను చేసిన అపరాధం కారణమేమో ఆలోచించండి'' అని చెప్పింది. శర్యాతి వెంటనే ఆపుట్ట ఉన్నచోటికి వచ్చి తపఃక్లేశంతో కృశించిపోయి ఎముకలగూడుగ నున్న అతివృద్ధుడైన చ్యవనమహర్షిని చూచి నమస్కరించి ఇట్లన్నాడు. 'ఈమె నాకుమార్తె సుకన్య, అద్భుతమైన మీ తపోమహిమ తెలియలేక పుట్ట త్రవ్వించి మహాపరాధం చేసింది. ఈమె తప్పుమన్నించి నాసైన్యమున కేర్పడిన మూత్రపురీషనిర్బంధం మాన్పండి. స్వామీ! ఇంతులు ఎరుకమాలినవారు కదా! నా పుత్రిక ననుగ్రహించండి'' అని వేడుకొన్నాడు.

**శర్యాతి సుకన్యను చ్యవనునకిచ్చి పెండ్లిగావించుట :**

భార్గవుడు కరుణించి - ''రాజా! అతిశయరూప యౌవన

గర్వంతో ఇంత చేసిన నీ కుమారిని పెండ్లాడిగాని క్షమించను'' అని పలికినాడు. శర్యాతి మహారాజు తన తనయను మౌనివర్యుడైన చ్యవనుని కిచ్చి పెండ్లి చేయడం కన్న మరొక భాగ్యం లేదని సంతోషంతో ఆమెను అప్పుడే ఆమునివరునకిచ్చి సేనానిరోధం తొలగించుకొని తన పట్టణానికి వెళ్ళాడు.

**చ్యవనమహర్షికి యౌవనం :**

ఇక్కడ సుకన్య పరమభక్తితో పతికి సకల పరిచర్యలు సలుపుతూ సంతోషంగా ప్రొద్దులు పుచ్చుతుంటుంది. ఆమె పాతివ్రత్యాన్ని పరీక్షింపదలచి అశ్వినీకుమారులనే దేవవైద్యులిద్దరు ఆమె దగ్గరకు వచ్చారు. ఆసమయంలో చ్యవనుడు ఆశ్రమంలో లేడు. ఆశ్రమస్థలికి వచ్చిన అశ్వినీదేవతలను సుకన్య పూజించింది. అంతట వారు తామెవరో ఆమెకు తెల్పి ''నీవెవరి కూతురివి? ఎవరి భార్యవు? అని ప్రశ్నించారు. ''నేను శర్యాతి మహారాజు కుమార్తెను. భృగుమహర్షి కుమారుడైన చ్యవనుని ధర్మపత్నిని. నా పేరు సుకన్య'' అని ఆమె తన వృత్తాంతం వారికి నివేదించింది. అంతట అశ్వినీకుమారులు పకపక నవ్వుతూ ''అక్కటా! విధివిలాసము నేమనవచ్చు? ఇంతటి రూపసంపన్నవై ఉండికూడ కామభోగానికి బాహ్యుడైన వృద్ధుణ్ణి, భార్గవుణ్ణి కట్టుకొని నీ యౌవనాన్ని అడవి గాచిన వెన్నెల చేసుకొన్నావు. ఇంతటనైన నీ వయస్సునకు రూపానికి తగిన వరుణ్ణి చూచుకో! కోరుకో! నీవు కోరినవానిని నీకు తెచ్చి ఇస్తాము'' అని అశ్వినీదేవతలన్నారు.

వారి పలుకులు తన చెవులకు ములుకులు కాగా సహించలేక సుకన్య వారితో ఇలా అన్నది. ''అయ్యలారా! నేను మిక్కిలి అనురాగంతో అగ్నిసాక్షిగ భృగునందనుణ్ణి పెండ్లాడినాను. అతడు కృశుడైన అగుగాక! క్షీణబలారోగ్యములు కలవాడైనా అగుగాక! వృద్ధుడైన అగుగాక! నామనసు

అతనియందే లగ్నమై యున్నది. ఒక పతివ్రతాలలామతో మీరనవలసిన మాటలేనా ఇవి?'' అని వారిని మందలించింది. అవతల సుకన్య అశ్వినీదేవతలాడిన మాటలన్నింటినీ పూసగ్రుచ్చినట్లు తన పతిదేవునకు చెప్పివేసింది.

చ్యవనమహర్షి ఆమె సౌశీల్యమునకూ, పాతివ్రత్యమునకూ సంతోషించి '' దేవీ! ఇందులో అశ్వినీదేవతలను తూలనాడవలసిన పనిలేదు. వారి పలుకులకు నీవు ఒడంబడుము. నవయౌవనుడైన పతిని గొని రండని పలుకుము'' అని సుకన్యను మరల వారి చెంతకు పంపినాడు. ఆమె ఆశ్వినేయులను గాంచి ''నేను వాంఛించినచో నాకు నవయౌవనాంగుడైన పతిని గొనివత్తుమని ఇంతకు మునుపు చెప్పినారు కదా! నేను కోరుచున్నాను; అట్లే కొనిరండని సుకన్యవారిని కోరింది. వెంటనే అశ్వినులు పయోష్ణి అనే ఆ సరస్సులో ప్రవేశించారు. అదే సమయంలో చ్యవనుడు కూడ ఆ మడుగులో మునిగినాడు. పిదప ఆ ముువ్వురు నవయౌవనులై మడుగు వెలువడి సుకన్య కడకు వచ్చి నిలిచారు.'' మాలో నీకిష్టమైన వానిని వరునిగా వరింపు'' మని పలికినారు. సాధ్వీమణియగు సుకన్య చ్యవనునే వరించింది. ఇలా లబ్ధయౌవనుడైన భృగునందనుడు ఆశ్వినులకు అతిప్రీతుడై వారితో ఇలా అన్నాడు - ''అమరవైద్యులారా! మీవల్ల నేను లబ్ధయౌవనుణ్ణి, కృతార్థుణ్ణి ఐనాను. ఇందుకు కృతజ్ఞతగా సురరాజు చూస్తుండగా శర్యాతి మహారాజు చేత యజ్ఞం చేయించి ఆయాగంలో మిమ్ము సోమపీథులను చేస్తాను'' అని చెప్పగా వారు పరమానందభరితులై దివికి వెళ్ళినారు.

**చ్యవనమహర్షి అశ్వినీదేవతలను సోమపానార్హులను చేయుట :**

చ్యవనుడు జరాభారపరిత్యాగం చేసి నవయౌవనంతో విలసిల్లుతున్నాడని శర్యాతి విని విస్మయం చెంది కుమారతన కూతురినీ,

అల్లుణ్ణి చూడటానికి వచ్చాడు. వచ్చిన శర్యాతిని మిక్కిలి ఆదరించి భార్గవు డన్నాడు. ''మహారాజా! మీ కభ్యుదయ హేతువైన క్రతువొకటి మీచే చేయిస్తాను. మీరు తప్పక చెయ్యండి. అందుకు అవసరమైన యాగసంభారాలను సమకూర్చండి.''

శర్యాతి మహారాజు చ్యవనుని వచనాలకలరి యాగం సల్పినాడు. విధిప్రయోగయుతంగా చ్యవనుడు అశ్వినులకు సోమమివ్వడానికి పూనుకోగానే అతడిపై కోపించి దేవేంద్రుడు ''భృగునందనా! వీరిద్దరు దేవవైద్యులు. వీరిని సోమపీథులను గావించకండి. బృందారకులు కాని వారికి సోమమిచ్చు వారెవ్వరైన కలరా? కనుక వీరికి సోమమివ్వవద్దు. నేనెంతమాత్రము సహించను'' అని నివారించాడు.

చ్యవనుడు ఇంద్రుని గర్వమణచుట :

చ్యవనమహర్షి ఇంద్రుని మాటలు లెక్కపెట్టక అశ్వినులను సోమపీథులను గావించాడు. అందుకు ఓర్వలేక జంభాంతకుడల్గి విజృంభించి చ్యవనుని కొట్టుటకు వజ్రాయుధమెత్తినాడు. చ్యవనుడు వజ్రయుతమైన సురపతి భుజస్తంభాన్ని స్తంభింపజేసి మిక్కిలి సంరంభంతో దేవేంద్రుణ్ణి అంతమొందించడానికి హోమం చేశాడు. అతడట్లు అగ్నిలో వేల్వగా ఆ హోమకుండంనుండి అపార ఘోర బలుడైన మదుడనే మహారాక్షసుడు ఉద్భవించాడు. వాని ఆకారం ఇటు అవనీచరులకు, అటు ఆకాశచరులకూ భయప్రదంగా వుండినది. ఇలా ఆవిర్భవించిన ఆ రక్కసుని బాహుదండాలు పదివేల ఆమడలనిడివి గలవై ఉన్నాయి. అతని నాల్గుకోరలు. అవి శతయోజన విస్తీర్ణాలు. దంతాలు దశయోజనాయతాలు. కళ్ళు సూర్యచంద్రమండలాలను సరిపోలుతున్నాయి. ముఖం కాలాగ్ని సన్నిభంగా ఉన్నది. శరీరం దిక్కుల్నీ నభోభాగాన్నీ ఆవరించింది. నోరు భూమ్యాకాశాలను ఒక్కసారి

గుటుక్కున మింగజాలునంతటి విరివి గలదై భీతిగొల్పుతున్నది. జగజ్జనులకు భయము పుట్టించు దీర్ఘజిహ్వతో అతడు తన పెదవులను నాకుకొంటూ దారుణమైన కంఠస్వరంతో దిక్కులను బ్రద్దలు గావిస్తున్నాడు. మీదిమీదికి వస్తున్న ఆ నక్తంచరుణ్ణి చూచి సురేంద్రుడు గడగడ వణకిపోయాడు. అతని మేను చెమటతో తడిసిముద్దయింది. చ్యవనుని వల్ల భుజము స్తంభితమైనందున మదరాక్షసుని ఏమీ చేయలేక పోయినాడు. ఇంద్రుడు చ్యవనుడికి కృతాంజలియై ''మునీంద్రా! మీ తపశ్శక్తి నెదుర్కొన నెవ్వరితరం? అశ్వినీదేవతలు ఇది మొదలు సోమార్హులౌతారు. నా యెడ ప్రసన్నుడవగుము. నా అపరాధం మన్నింపు'' మని వేడుకొన్నాడు.

ఆమాటలతో చ్యవనుని అలుకతో పాటు అమరేశ్వరుని బాహుస్తంభనం కూడ తొలగిపోయింది. ఇంద్రుడు భృగుపుత్రునియొద్ద సెలవు తీసుకొని తన పురానికి వెళ్ళినాడు. తరువాత ఆమద రాక్షసుడు తనకు ఆశ్రయమేదో తెల్పుమని చ్యవనుని వేడుకొన్నాడు. వేట, వెలది, జూదము, పానము అతనికి ఆశ్రయస్థానాలుగా చ్యవనుడు కల్పించాడు. అశ్వినులు హాయిగా సోమపానమొనర్చి స్వర్గానికి వెళ్ళిపోయారు. భృగువంశ సంజాతుడైన చ్యవనుడు తన తపోమహిమను ప్రకాశింప జేయుటవల్ల అది మొదలుకొని ఆ వైదూర్య పర్వతము ఆర్చీక పర్వతమని ప్రసిద్ధి గాంచింది.

చ్యవనుడొకనాడు సుకన్యను చెంతకు చేరబిలిచి ''దేవీ! శర్యాతి మహారాజు పుత్రివై మహారాజభోగాలనుభవింపదగిన నీవు పండ్లు పూండ్ల తపశ్చర్యలో ఎముకల ప్రోవుగా మిగిలియున్న పరమవృద్ధుణ్ణే నన్ను పరిణయమాడినావు. కృశీభూత శరీరుడనీ, ముసలివగ్గనీ ఏవగించుకొనక నన్నే పరదైవతంగా భావిస్తూ నాకు సేవలు సలుపుతూ

సంతోషంతో ప్రొద్దులు పుచ్చుతున్నావు. నీ త్యాగశీలాన్ని ఏమని కొనియాడగలను? సఖీ! నన్ను పెళ్ళాడినది మొదలు ఇంతవరకు సంసారసుఖమంటే ఏమిటో నీ వెరుగవు. నీవంటి పుణ్యవతి, సాధ్వీశిరోమణి ఈ రేడుజగాలలో ఎందు వెదకినా కనిపించదు. నీ సతీత్వమునకు సంతోషపడి నిన్ను సంతోషపెట్టుటకే నవయౌవన మంగీకరించాను.

నీకు దధీచి, ప్రమతి, అప్రవానుడు అను ముగ్వురు లోకోత్తరచరిత్రులు తనయులుగా ఉదయిస్తారు. వారిలో దధీచి దేవహితార్థం తన శరీరమునే సమర్పణచేసి విశ్వవినుత విఖ్యాతి నార్జిస్తాడు!, అనిపలికి చ్యవనుడు సుకన్యకు సత్పుత్ర ప్రదానం చేసాడు. పరమ యోగీంద్రునకు పత్నినైతిగదా యని శర్యాతిపుత్రి సంతోషసాగరంలో ఓలలాడింది. బహుకాలం చ్యవనుడు గృహస్థాశ్రమధర్మం నిర్వహించి పదపడి తీర్థయాత్రాచరణశీలుడైనాడు.

**చ్యవనమహర్షి నహుషుణ్ణి అనుగ్రహించుట :**

భృగునందనుడైన చ్యవనమహర్షి గంగాయమునల సంగమంలో అలఘునిష్ఠతో అచంచలుడై జలములందు సమాధిపరుడై ఉండినాడు. అతడలా ఉదవాస మహావ్రతం సల్పుతున్నప్పుడు అతని చుట్టూ చేపలగుంపు చేరింది. మత్స్యములతని శరీరాన్ని స్పృశిస్తూ, మూచూస్తూ ఎట్టిచెరుపు చేయకుండా మెలగుతుండినవి. వాటిపై మునికి కృప కలిగింది. వాత్సల్యముదయించింది. అతడలా నిశ్చలభావంతో ఆ నీళ్ళల్లో పన్నెండేళ్ళుండినాడు. ఇట్లుండగా ఒకరోజు జాలరులు వచ్చి ఆ ప్రదేశంలో వలలు విసరి అక్కడి మీలను పట్టి ఒడ్డున పడవేస్తున్నారు. ఒకతడవ చేపలతోపాటు అమోఘతపశ్శాలియైన చ్యవనుడు కూడ వలలో పడ్డాడు. బెస్తలు వలను వెలుపలికీడ్చారు. సంభ్రమాశ్చర్యాలతో వారు

వలలోనున్న మహామునీంద్రుణ్ణే చూశారు. కైవర్తుల కాయములు కంపించాయి. గుండెలు దడదడలాడినవి. ఇంక చెప్పేదేముంది? వారామహామునీంద్రునకు సాగిలపడి నమస్కారాలు చేసి ''స్వామీ! మాతప్పు మన్నించండి. మా అజ్ఞానంవల్ల ఇంతపని జరిగింది. కృపతో వీక్షించి మేమేమి చేయవలెనో ఆజ్ఞాపించండి'' అని మహర్షిని వేడుకొన్నారు. ''బెస్తలారా! ఈ జలచరాలతో నేను పన్నెండేళ్ళు ఈ నీటిలో కలసిమెలసి నివసించాను. చేసిన సహవాసం వీటిమీద నా కనురాగం పెంచింది. ఈ మత్స్యాలతోపాటు నేనూ మీకు పట్టుబడ్డాను. ఇందుకు తగిన తెఱగు మీకు చెపుతాను వినండి. ఈ చేపలతోపాటు మీరు నన్ను తగిన వెలకు అమ్ముకొనండి'' అని పలికినాడు. ఆ మాటలు విని బోయలు బెదరిన, చెదరిన మనస్సులతో శీఘ్రంగా తమ ఏలికయైన నహుషుని దగ్గరకు వెళ్ళి మునీంద్రుడు పలికిన పలుకుల చందమంతా అణకువతో చెప్పుకొన్నారు.

నహుషుడు భయసంభ్రమాకులమైన మనస్సుతో హుటాహుటి మంత్రిపురోహితసహితంగా వౌని చెంతకు వచ్చాడు. సాష్టాంగ వందనాలాచరించి ''మహామునీ! బోయలుచేసిన అపరాధమునెట్లు బాపుకొందునో తెలియక దుఃఖిస్తున్నాను. సెలవిండ''ని వినయంతో విన్నవించుకొన్నాడు. అంతట దయాళువైన చ్యవనమహర్షి ''రాజా! ఇందులో బోయల తప్పేమున్నది? వారు తమ కులధర్మం నిర్వర్తించారు. ఇది అపరాధం కానేరదు. నేను చెప్పేమాటలు విను. వీరు జలములనుండి నన్ను వెలికీడ్చుటలో మిక్కిలి శ్రమపడినారు. నా శరీరమునకు తగిన వెల వీరికిమ్ము'' అని పలికినాడు. చ్యవనుని మనస్సులో తమపై కొంచెం కూడ కోపం లేనందుకు సంతోషించి జనపతి వేయిమాడలు ఈ కైవర్తుల కివ్వండని తన మంత్రులకాజ్ఞ ఇచ్చాడు. మునీంద్రుడు ఆ పలుకులు విని

''న్యాయంగా నా శరీరమునకు తగిన వెల బెస్తలకి''మ్మని మరల నృపతిని కోరినాడు. పుడమిరేడు పదివేల మాడలన్నాడు. మునీంద్రుడు తగిన వెలనిమ్మని మరల రాజును హెచ్చరించాడు. రాజు లక్షమాడలన్నాడు. అదికూడ తగిన వెలకాదని తపస్వి వచించాడు. నృపుడు కోటి మాడలన్నాడు. చ్యవనుడు అనంగీకారసూచకంగా తల అడ్డంగా త్రిప్పుతూ ''రాజా! ఈ పేదబోయలకు తగిన వెల ఇచ్చుట ధర్మము గదా! అన్నాడు. అంతట నరపతి ఆలోచించి బోయలకు తన రాజ్యంలో సగమిస్తానన్నాడు. చ్యవనుడు నా శరీరమునకు తగిన వెల అర్ధరాజ్యమేనా? ఇది కూడ నా శరీరమునకు తగిన వెలకాదని ఆమునీంద్రుడు వచించాడు. అంతట నహుషచక్రవర్తి ''మునివరా! నా సకలసామ్రాజ్యం బోయలకివ్వడానికి సంసిద్ధంగా ఉన్నానని నుడివినాడు. ''రాజా! నా శరీరం వెల ఈ పాటిదేనా? నీవు, నీమంత్రులు, నీస్నేహితులు కూర్చుండి నెమ్మదిగ ఆలోచించి ఉచితమైన మూల్యము బోయలకు చెల్లించండ''ని పలికి మిన్నకున్నాడు.

మౌనిమాటలు విని సార్వభౌముడు విషాదవదనంతో ఆవలి కరిగి సచివులతో '' ఇంకేమి చేయడం'' అని చింతించే సమయంలో అక్కడికి ఆకస్మికంగా కవి జాతుడనే ఒక మహానుభావుడు వచ్చాడు. ఆ సంయమీంద్రుడు రాజును గాంచి ''నరవరా! చింతించకండి. నేను మునికులనాథుడైన చ్యవనుని మూల్యం ఎంతో నిర్ణయిస్తాను'' అని చెప్పినాడు. ఆ మాటలకు అవనీనాథుడూ, అతని పరివారమూ హర్షాంబుధిలో ఓలలాడుతూ ''మమ్ము విపత్సాగరంలో మునుగ కుండునట్లుగా ఆశీర్వదించండి'' అని వేడగా కవిజాతుడిట్లన్నాడు. ''గోవులకూ, బ్రాహ్మణునకూ కులమొక్కటే. బ్రహ్మదేవుడు గోవును హవిస్సునకు కారణంగా, బ్రాహ్మణులను అన్నిమంత్రాలకు అధిష్ఠానంగా

చేశాడు. సకలాగమములకు ఆశ్రయమైన అవనీసురుడికి మూల్యమింతయని చెప్పడం శివునికి గూడ శక్యం గాదు. రాజా! గోవుకూడ అటువంటిదే. భార్గవునికి బదులుగా బెస్తలకు ధేనువు నివ్వు'' అని కవి జాతుడు చెప్పాడు. అందుకు ప్రియమంది నహుషనరపాలుడు చ్యవనునికడకు వచ్చి ''మహాభాగా! నన్ను కరుణార్ద్రదృష్టితో వీక్షించు. మీ దేహమున కింత వెలయని ఎంతవారికిని నిర్ణయింప తరమగునా? యోగీశ్వరా! మీకు బదులుగ బెస్తలకు గోవునిస్తా''నని నహుషుడు వచించాడు. చ్యవనమహర్షి వికసిత ముఖుడై ''రాజా! నాకు అనుగుణమైన మూల్య నిర్ణయంతో సంతోషించాను. గోవు అగ్నిమయము; అమృతమయం. అమరావాసానికి అది నిచ్చెన. అమరులకైనను అది పూజ్యమైనది. మీ నిర్ణయం నన్ను ప్రీతుని గావించింది. అలాగే బోయలకు గోవు నిచ్చివేయి'' అన్నాడు. నహుషుడు బెస్తలకు ధేనువునిచ్చాడు. వారు సమ్మోదంతో భార్గవుని పద సమీపం చేరి ''మహాత్మా! మిమ్ము చూచినది మొదలు మాయందు తమరు అనుగ్రహం చూపుతున్నారు. మా మనవి చిత్తగించండి. మీ యాజ్ఞతో మేమిచ్చు ఈ ధేనువును దయతో స్వీకరించండి'' - అని వేడుకొన్నారు.

''వేడుకొన్నవారిపై వాడిచూపు పాముచూపు వంటిది గనుక మీ ప్రార్థనాభంగం చెయ్యను. మీ ఇష్టప్రకారం గోవును స్వీకరిస్తాము'' అంటూ అలా చేశాడు.

అంతటితో ఆగక ఆ మహాయోగి బెస్తలపై తనకున్న ప్రీతి, చేపలపై తనకున్న కూర్మి మనసున కందళించగా కైవర్తులను జూచి- ''దాయనలారా! మీరూ ఈ మీనములూ సమ్మోదంతో స్వర్గలోకానికి వెళ్ళండి'' - అని అక్కడి వారందరు వింటుండగా పలికినాడు. అతని నోటినుంచి ఆమాటలు వెలువడటమే తడవుగా ఆ బోయలు, ఆ

మీనములు తనువులతో రివ్వున ఎగసి స్వర్లోకమునకు వెళుతుండగా నహుషనరపాలుడు సపరివారంగా ఆశ్చర్యపూర విమగ్న మనస్కుడై చూశాడు.

**చ్యవముడు నహుషుని ఇంద్రపదవి నందుమని ఆశీర్వదించుట :**

పిదప చ్యవనమహర్షి, సంయమీంద్రుడైన కవిజాతుడు ఆ నహుషమహీపతిని చెంతకు పిలిచి ''రాజా! రెండు వరాలడుగు. ఇచ్చుటకు సిద్ధంగా వున్నా'' మన్నారు. అందుకు నహుషచక్రవర్తి ''మహాత్ములారా! అవిరళమైన మీప్రీతికంటె నాకు అడుగదగిన అర్థములున్నవా?'' అని సమాధానమిచ్చాడు. అందుకువారు అగ్గలమైన ఆదరంతో ''మహారాజా! నీకు ధర్మపరత్వం, వాసవునితో తుల్యమైన వైభవం కలుగుగాక''! అని ఆశీర్వదించి అంతర్ధానమైనారు.

నహుష చక్రవర్తి ఆ మహనీయుల ఆశీస్సులు పొంది వారి మహిమల నెన్నుతూ సంతోషంతో తన సదనం చేరినాడు. చ్యవనమహర్షి ఆశీర్బలం వల్లనే నహుషుడు ఒకసారి ఇంద్రపదవిని పొందినాడు.

చ్యవనుడు తన విప్రకులం కుశిక కులం వల్ల సంకరమవుతుందని బ్రహ్మసభలో విని క్షత్రియవంశమైన కుశికవంశానికి ఉత్పాతం కలిగించే ఉద్దేశంతో కుశికభూపతి వద్దకు వచ్చాడు. కుశికమహారాజా చ్యవన మహర్షికి ఎదురేగి తోడ్తెచ్చి భార్యాసహితుడై భక్తి శ్రద్ధలతో పూజించాడు. సుఖోపవిష్టుడైన చ్యవమునితో కుశికుడు - ''మునీంద్రా ! నేను తమ భృత్యుణ్ణి. నా సేవలందుకుంటూ తమరే ఈ రాజ్యాన్ని పాలించండి. నేను, నా భార్య, నా బంధువులు, నా పరిజనులు, నానాజనసహితంగా మిమ్ము కొలుస్తాము. మీ యేలుబడిలో సుఖపడుతాము'' అని ప్రార్థించాడు. అందుకు మునిప్రవరుడైన చ్యవముడు కుశికునితో ''రాజా! మాకు రాజ్యకాంక్ష లేదు. ఒక సద్వ్రతము పూని ఇలా సంచరిస్తూ

సంచరిస్తూ నీ కడకు వచ్చాము. నీవూ, నీ ధర్మపత్నీ మాకు పరిచర్యలు కావించడమే మా కోరిక'' అన్నాడు.

మౌనీంద్రుని మాటలకు రాజదంపతులు హర్షించి, ఇంతకన్న భాగ్యమేమున్నది అని పల్కి మునీశ్వరుని అభ్యంతరమందిరంలోనికి కొనిపోయారు. ఒక రమణీయమైన ప్రదేశం చూపి ''మహాత్మా! మీరిక్కడ నివసించండి'' అని పలుకుతూ పరుండుటకు మెత్తని పాన్పు, కూర్చుండుటకు మంచి ఆసనము చూపినాడు.

ఇంతలో భానుడస్తమించాడు. చ్యవనమహర్షి కాలోచిత కృత్యాలు నిర్వర్తించి ఆహారమడిగినాడు. వెంటనే మహారాజు ఆ మహర్షిని మహిత భోజనంతో సంతృప్తిపరచాడు. భోజనానంతరం చ్యవనుడు తల్పం చేరి ''రాజా! నాకు నిద్రవస్తున్నది. మీ దంపతులిద్దరు క్షణం ఏమరక నా పాదాలొత్తండి. ఇదే నాకు ప్రియం. నేనై మేల్కొనే వరకు నన్ను నిదురలేపరాదు. నా చరణసేవ మానరాదు'' అంటూ చ్యవనుడు నిద్రానిమగ్నుడైనాడు. అతడు ఒక్క ప్రక్కగా పవళించి ఇరువది యొక్క రోజులు గాఢనిద్రలో ఉండినాడు. రాజదంపతులు అన్నిరోజులూ నిద్రాహారాలు మాని ఆయన అడుగులొత్తుతునే ఉండినారు. ఇరువది రెండవనాడు ఆ మునివరుడు తనంతట తాను మేల్కొని ఏమీ మాట్లాడక ఇల్లు వదలి బిరబిరా వెళ్ళినాడు.

రాజదంపతులు ఇరువదియొక్క దినములు ఆహార నిద్రలు లేక మునికి చరణసేవ చేయడం వల్ల మిక్కిలి బడలిపోయారు. వారు నగరం విడిచి వెళుతున్న ముని వెంట వంటివారు. ఉన్నట్లుండి చ్యవనమహర్షి మాయమైపోయాడు. రాజదంపతులు మూర్ఛిల్లినారు. వారు కొంతసేపటికి తెప్పరిల్లి మౌనిని గానక చింతిస్తూ తమ అభ్యంతర గృహంలో ప్రవేశించారు. అలా ప్రవేశించి మునుపటి వలె గాక రెండవ

ప్రక్క మంచముపై పరుండి నిద్రిస్తున్న భృగునందనుణ్ణి చూచి ఆ సతీపతులు ఎంతో సంతోషించి ఎప్పటివలె ఆయన అడుగులొత్తు చుండగా మరొక ఇరువది యొక్క దినాలు గడచి పోయాయి.

ఇరువది రెండవ నాడు చ్యవనుడు మేల్కొన్నాడు. తాను తైలాభ్యంగనస్నానం చేయవలెనని పల్కినాడు. వెంటనే రాజు సంపంగి నూనె తెప్పించాడు. అతని శిరసంటి స్నానానికి వేన్నీళ్లు సిద్ధము చేయగా చ్యవనుడు ఆ రాజదంపతులను చెడదిట్టి అంతర్ధానమైనాడు. ఒక ఘడియ తరువాత ప్రత్యక్షమైనాడు. ఎట్టి వికారములు లేక సుప్రసన్నులై నిలిచియున్న ఆ రాజదంపతులను చ్యవనమహర్షి చూచి సుముఖుడై అభ్యంగనస్నానమాచరించాడు. రాజు కమ్మని భోజనము తెప్పించి భుజించుటకు పిలువగా చ్యవనుడు ఆ అన్నపానాలను ఎగాదిగా చూచి ఎక్కడికో వెళ్లిపోయాడు. కుశిక భూపతి చేసేది లేక మౌనం వహించాడు. అలా ఆ ప్రొద్దు గడచింది. మర్నాడు తెల్లవారగనే చ్యవనుడు ప్రత్యక్షమై ''రాజా! అరదం ఆయత్తపరచు. నీవూ, నీ పత్నీలాగుతుండగా ఆ తేరెక్కి నేను ఊరేగవలె. నా రథయాత్ర సాగేటప్పుడు దారి పొడవునా బంగారం, రత్నాలు, గుర్రాలు, గోవులు విరివిగా యాచకులకు పంచాలి సుమా!'' అన్నాడు.

రాజు రథాన్ని సిద్ధం చేశాడు. దాపట, వలపట అశ్వాలుగా రాజదంపతులు నిలిచారు. చ్యవనుడెక్కిన రథాన్ని వారు లాగుతుండగా ముని చెప్పిన వస్తువులను మంత్రులు యాచకులకు పంచసాగినారు. సంయమీశ్వరుడు రథము నీడ్చుచున్న రాజదంపతులను వాడి ములుగర్రతో నెత్తురు కారునట్లు పొడుస్తూ నగరసంచారం కావించాడు. అనేక దినములు ఆహారనిద్రలు లేనందున బడలి తూలుతున్న రాజునూ, రాణినీ ములుగర్రతో పొడవటంవల్ల వారి దేహాలు పూచిన మోదుగ

వృక్షాలవలె కనిపించాయి. రాజదంపతులనలా హింసిస్తున్న మునీంద్రుణ్ణి చూచి ప్రజలు ''ఇది అన్యాయమని అడుగుటకూ, ఇది న్యాయమని పలుకుటకూ, తేరిపార జూచుటకూ శక్యంగాని తపోమహిమతో దీపిస్తున్నాడు ఇతడు. ఈ రాజదంపతుల ధీరత్వం, నిష్ఠాపరత్వం వర్ణించుటకు వేయినోళ్లు చాలవు. భరింపరాని భారాన్ని నిర్వికారంగా భరిస్తున్నారు ఈ పుణ్యదంపతులు'' అని చింతిస్తూ జనం రథాన్ని పరివేష్టించి వెళుతుండగా చ్యవనుడు పురం వెడలి రాజదంపతుల మనసుల్లో ఎట్టి వికారమూ లేనందున ఒక వంక ఆశ్చర్యం, మరోవంక ఆనందం హృదయంలో పెనగొనగా వెంటనే రథం దిగినాడు. రాజదంపతుల శిరస్సులకు గట్టిన పగ్గాలు ఊడదీసి వారి దేహాలను తన పాణిపల్లవంతో నిమిరాడు. చ్యవనమహర్షి ఆ జనపతి ముఖం చూస్తూ ''రాజా! ఎంతో డస్సినావు. వరిమిస్తాను. వగపు మాని పట్టణానికి వెళ్ళు. నేను గంగాతీరవనంలో నా వ్రతచర్యాశేషాన్ని ఈరోజు నిర్వర్తిస్తాను. నీవు పత్నీసమేతంగా రేపు నా దగ్గరకు రా'' అని పలికినాడు. రాజు తన దేహాన్ని, తన భార్య శరీరాన్ని చూచుకొని అద్భుతానంద పరవశుడై చ్యవనునితో ''మహాత్మా! మీ యనుగ్రహంవల్ల మాకెట్టి శ్రమ లేదు. శరీరంలో గాయాలు లేవు. మీ మహిమ వర్ణింపతరమా? నేను, నా భార్యయు ఎల జవ్వనంతో విలసిల్లుతున్నాము. మీ మహానుభావత్వము ఎంతటి అద్భుతమునైనా కావించగలదు'' అని వినయంగా పలికాడు. పత్నీ సహితంగా దండప్రణామాలు చేసి సంయమీంద్రుని వీడ్కొని జన పరివేష్టితుడై పురప్రవేశం చేశాడు.

ఆనందంలో ఆ పగలు, రేయి గడపి సూర్యోదయం కాగానే ఆ రాజదంపతులు ప్రాతస్సమయాచారాలు నిర్వర్తించి మౌనీంద్రుడు పిలిచిన గంగాతీరకాననానికి వెళ్ళినారు.

అక్కడ మణిమయము, అతిసుందరము, దేవతా భవన సమానము అయిన ఒక విశాల రమ్యసౌధాన్ని రాజదంపతులు చూశారు. దాని చుట్టూ మండపాలు; ఆ మండపాలలో వేదాధ్యయనము, సంగీత సాహిత్యగోష్ఠులు.

ఆ హర్మ్యం చుట్టూ పూలతోటలు. ఆ తోటలు కోకిలగానంతో చిలుకల పలుకులతో, తుమ్మెదల ఝుంకారంతో నిండి వున్నాయి. అక్కడెన్నో సరస్సులు. ఆ సరస్సులు హంసలు సారసపక్షుల యొక్క కిలకిలారావములతో ఇంపుగొల్పుతున్నాయి. అక్కడ ఎన్నో క్రీడా పర్వతాలు. అవి నెమళ్ల యొక్క క్రేంకార ధ్వనులతో ప్రతిధ్వనిస్తున్నాయి ఇలా చెవులకూ, కనులకూ విందు గావిస్తూ ఆ భవనరాజం ఎంతో వైభవంతో దీపిస్తూ స్వర్గపురి నేలకు దిగి వచ్చినదా అన్నట్లున్నది. అక్కడ పరమాహ్లాదంతో సురలు, గంధర్వులు, అప్సరసలు, సరసపు పలుకులు పలుకుతూ వివిధ విహారాలు సల్పుతున్నారు. ఆ మందిరం తిలకించి కుశిక చక్రవర్తి, ఆయన భార్య తమ మనస్సులు అద్భుతరసంలో మునిగిపోగా ''ఇది కలయా ? లేక నిజమా ? కల అయితే అనుభవ గోచర మెట్లవుతుంది ? ఇది ఉత్తర కురుభూమియా ? లేక స్వర్గమా ? ఈ తాపసేంద్రుని దయవల్ల సశరీరంగా స్వర్గంలో అడుగిడగలిగినాము'' అని భావిస్తూ ఆ మహనీయ సౌధంలో ప్రవేశించారు. అక్కడ మణిమయ తల్పంలో పవళించియున్న చ్యవనమహర్షిని వారు వీక్షించారు. అపర క్షణంలోనే ఆయన అంతర్హితుడైనాడు. అతనితోపాటు ఆ మేడ, అక్కడ అంతకుమునుపు వారు దర్శించిన అశేష విశేషాలూ అదృశ్యమై పోయాయి.

రాజదంపతులు అటూ, ఇటూ తిరుగుతూ ఆ అరణ్యంలో ఒకచోట దర్భచాపపై ఆసీనుడై జపం చేస్తున్న ఆ సంయమీంద్రుణ్ణే చూశారు. పిదప రాజు రాణితో ఇలా అన్నాడు. ''దేవీ ! మునీశ్వరుని

యోగ బలమెట్టిదో పరికించావు కదా ! మానవుడు రాజ్యం సంపాదించడం సులభం. బ్రాహ్మణత్వం, తపస్సూ ఈ రెండూ దుర్లభం. ఈ మహానుభావుడు తపోబలం వల్ల వలసినట్లు చేస్తున్నాడు''.

రాజిట్లు పత్నితో పల్కుతుండగా చ్యవనుడు వారిని సమాదర బుద్ధితో చెంతకు పిలిచాడు. కుశికుడు, అతని ధర్మపత్ని మోడ్చిన చేతులతో అతని దగ్గరకు వెళ్ళి దండప్రణామాలు గావించారు. మౌని రాజు వదనం మీద ప్రసన్నదృక్కులు పరపుతూ ''నరేశ్వరా ! నీవు ఇంద్రియాలనూ, మనస్సునూ నీ వశంలో ఉంచుకొన్నావు. నీయందు ప్రీతుడనైనాను. ఏదేని వరం కోరుకో ఇస్తాను'' అన్నాడు. అందుకు రాజు ''దేవా ! నీవు అగ్నికల్పుడవు. నీ మనస్సు ప్రసన్నమగునట్లు కొలుచుటకంటె కోరదగిన వరం మాకు వేరే లేదు. అయినా మిమ్మొకటి అడుగుతాను. మీరు మా ఇంటికి వచ్చి ఎడమప్రక్క ఇరువది యొక్కరోజులు, కుడిప్రక్క ఇరువది యొక్క దినాలు పవళించి నిద్రించారు. మీ చరిత్రం అత్యద్భుతం. ఇలా ఎందుకు పవళించారో ఇందుకు కారణమేమో ఎంత యోచించినా గోచరించడం లేదు. చెప్ప దగినది అయితే దయతో చెప్పండి'' అని అడిగినాడు.

అందుకు చ్యవనమహర్షి కుశికునితో ఇలా అన్నాడు ''నరవరా! సురలూ, మునులూ సేవిస్తుండగా పరమేష్ఠి ఒకనాడు ప్రసంగవశాన భృగుకుశిక వంశాలకు బ్రహ్మ క్షత్రములు తారుమారై సంకరము ఏర్పడగలదని చెప్పినాడు. అపుడు నేనక్కడ ఉన్నాను. ఆ మాటలు విన్నాను. అట్టి సాంకర్యం సహించలేక మీ వంశాన్ని నాశనం చెయ్యదలచి వ్రతం నెపంతో మీ యింటిలో ప్రవేశించాను. ప్రవేశించి ఇన్ని పోకడలు పోయాను. అలసి, డస్సి మీరెప్పుడేని అడ్డమాడితే శపించాలని యెంచాను. మీయందు ధైర్యహాని, దుఃఖము కోపము లేనందుకు మెచ్చుకొని

వరమిచ్చుటతో పాటు తృప్తిపడక ఈ గంగాతీరంలో మీరు బొందితో స్వర్గం చూచేట్లు చేశాను. ఇంత చూచికూడ, రాచరికమునందు ఉదాసీన వైఖరి, బ్రాహ్మణ్యమునందు ఆదరభావం మీకు ఏర్పడటం నాకు విదితమైంది. రాజా! నీకు మూడవవాడు బ్రహ్మతేజోవిరాజితుడై జనించగలడు. మరి నీకు కావలసిన వరం కోరుకొమ్మని పల్కినాడు.

కుశిక భూపతి ''దీనికంటె మించిన వరం కలదా ? నా సంతానం బ్రహ్మతేజోబలనిరూఢం, పరమధర్మతత్పరం అగునట్లుగా అనుగ్రహించండి'' అని చ్యవనమహర్షికి ప్రణమిల్లినాడు. అట్లే అవుతుందని పల్కుతూ చ్యవనుడు ''నీ మనుమడు విశ్వామిత్రుడు త్రిలోకపూజనీయుడౌతాడు'' అన్నాడు. అంతట కుశికుడు ''మహాత్మా! అతడేకారణాన బ్రాహ్మణుడౌతాడో విన కుతూహలంగా వుంది అన్నాడు. అందుకు తాపసోత్తముడు ''నృపాలా ! చెపుతాను విను. నా వంశంలో ఋచీకుడనేవాడు జన్మిస్తాడు. అతడు నీ కుమారుడైన గాధి యొక్క పుత్రికను సత్యవతిని వివాహమాడుతాడు. గృహస్థాశ్రమ ధర్మం నిర్వహిస్తూ సంతానకాంక్ష కలిగి తన భార్య సత్యవతితో ''నీకు పుత్రుని పుట్టించగల దివ్యాన్నం ప్రసాదిస్తాను'' అంటాడు. అందుకు సత్యవతి ''నాథా ! మా తల్లి తనకు కూడ పుత్రుడు కలిగేటట్లు మిమ్ము ప్రార్థించమని ఇంతకు మునుపు నాతో చెప్పింది కనుక మా తల్లికి కూడ ''చరువును'' అనుగ్రహించమని కోరుతుంది. అపుడు ఋచీకుడు పరబ్రహ్మమును ఆవహింపజేసిన రెండు చరువులను కల్పనచేసి ''దేవీ! ఇది బ్రాహ్మము. ఈ చరువు క్షాత్రము. నీవు, మీ తల్లీ స్నానం చేసి నీవు అత్తిచెట్టును, మీ అమ్మ రాగి చెట్టును కౌగలించిన తర్వాత నీవు బ్రాహ్మమును, మీ తల్లి క్షాత్రమును భుజించాలి'' అని చెప్పినాడు. విధి వైపరీత్యం వల్ల తల్లికీ, కూతురుకూ చరువూ, తరువూ తార్మారవుతాయి.

దివ్యజ్ఞాన సంపన్నుడైన ఋచీకుడు పత్నీగర్భం చూచి నీ కడుపులోని బిడ్డ క్రూరుడైన రాచకొడుకేగాని బ్రాహ్మణుడు కాడు. చరుతరువుల విపర్యాసఫలమిది'' అంటాడు. సత్యవతి విషాదవేదనతో భర్తను జూచి ''మీకు పుట్టే కొడుకు క్రూరుడైతే లోకం మెచ్చుతుందా ? మీతపోమహిమవల్ల అలా జరగకుండా చూడండి'' అని వినమ్రయై వేడుకొంటుంది. అపుడు ఋచీకుడు క్షాత్రతేజం తన కుమారుడైన జమదగ్నికి కాక అతనికి కలిగే పరశురామునికి సంక్రమించేటట్లు చేస్తాడు.

ఋచీకుడు చెప్పినట్లుగానే గాధిపత్ని గర్భం ధరించి బ్రాహ్మణగణ్యుడు, పరమతపోధనుడు అయిన కొడుకును కంటుంది. అతడే బ్రహ్మర్షి విశ్వామిత్రుడు. జన్మతో క్షత్రియుడైనా తరుచరువుల యొక్క గుణసంక్రమణం వల్ల అతడు సద్బ్రాహ్మణతాస్ఫురణం పొందాడు. బ్రహ్మ పలుకు సత్యం. మీ వంశం భార్గవకుల సంబంధం వల్ల శ్లాఘనీయమవుతుంది. ''రాజా ! నేను తీర్థయాత్రలకు వెళుతున్నాను. నీవు సుఖంగా ఉండు''మని దీవించి వెళ్తాడు. కుశికుడు భార్యా సహితంగా వందనమాచరించి ఋషివరేణ్యుని వీడ్కొని స్వగృహం చేరుకుంటాడు.

**చ్యవనుడు లవణాసురవధకు శ్రీరాముణ్ణి ప్రేరేపించుట :**

శ్రీరామచంద్రుడు అయోధ్యలో కొలువై యుండగా మరీచి కాశ్యపాది మునులతో చ్యవనమహర్షి వచ్చి వాకిట్లో నిలిచాడు. మంత్రి సుమంత్రుడు లోనికరిగి యమునాతీరవనవాసులైన మునీంద్రులు వచ్చియున్నారని రామునకు విన్నవించాడు. శ్రీరాముడు భయభక్తులతో ఆ మునీశ్వరులకు ఎదురేగి వారి పాదాలకు నమస్కరించి తోడ్తెచ్చి ఉచితాసనాలపై ఉంచి పూజించాడు. వారు తాము తెచ్చిన పుణ్య నదీపావన జలాలను, పరిపక్వ ఫలాలను రామప్రభువునకు సమర్పించి

ఆశీర్వదించారు. శ్రీరాముడు వారిని జూచి ''తపోధనులారా ! మీ సందర్శన భాగ్యంవల్ల కృతార్థుడనైనాను. నా సామంతులు, నా అనుజులు, నా భృత్యులు, నా దేహము, నా సర్వస్వము మీ అధీనం. దాసుణ్ణి నేను చేయవలసిన పనియేమో సెలవివ్వండి'' అని వినయ మధురంగా వచించాడు. అంతట చ్యవనమహర్షి ''రామప్రభూ ! కృతయుగంలో మధుడనే దైత్యుడు దేవతలు ద్విజులు తన్ను సద్గుణవంతుడని సంస్తుతించగా శివుని గూర్చి బహుకాలం తపస్సు చేశాడు. అతని తపస్సునకు మెచ్చి పరమేశ్వరుడు ప్రత్యక్షమై తన శూలంతో మరో శూలాన్ని సృష్టించి ''భక్తా ! ఈ శూలం సంగ్రామంలో నీ శత్రువుల గెల్చి మరల నిన్ను చేరుతుంది. ఎప్పుడు నీవు అధర్మమార్గాన్ని అవలంబిస్తావో అప్పుడు ఇది నిన్ను విడిచి నన్ను చేరుతుంది'' అంటూ మధుని చేతికిచ్చాడు. అందుకు మధుడు సమ్మతించి హరునకు మళ్లీ నమస్కరించి ''మహాదేవా ! ఉర్విపై నా కులమున్నంత వరకూ ఈ త్రిశూలాన్ని నిలుపు'' మని వేడుకొన్నాడు. అందుకు గౌరీశుడు ''ఓయీ! నీకొక కుమారుడుదయించి నీవెనుక దీనిని ధరిస్తాడు. శూలం ధరించియున్నంతవరకు శత్రువులకజేయుడవుతాడు. శూలం ధరించకుండ వైరి నెదుర్కొంటే అతని చేతిలో హతుడౌతాడు. శూలం తిరిగివచ్చి మా త్రిశూలంలో లీనమవుతుంది'' అని చెప్పివేశాడు.

ఆ తరువాత మధుడు లంకలో ప్రవేశించి రావణాసురుని కూరిమి చెల్లెలైన కుంభీనసను పట్టి తెచ్చి పరిణయమాడాడు. సముద్రుడు కాలకూటవిషాన్ని కన్నట్లు ఆమెవల్ల మధుడు కుటిలాత్ముడైన లవణాసురుణ్ణి కన్నాడు. తన కొడుకు దుర్మార్గుడైనందుకు ఎంతో జుగుప్స వహించాడు. వానికి బుద్ధులు చెపుతూ ''కుమారా ! ఇది ఈశ్వరుడిచ్చిన శూలం. నీ చేతమున్నంతవరకూ శత్రువులు నిన్ను చెనకలేరు. నీవెప్పుడూ

ఈ శూలాన్ని ఏమరవద్దు. ధర్మమార్గం వీడవద్దు'' అని పల్కి లవణాసురుణ్ణి మధుపురికి పట్టం కట్టి సముద్రంలో ప్రవేశించాడు.

పట్టాభిషిక్తుడైనది మొదలు లవణుడు మదమత్తుడై మావంటి మునులను కదలనియ్యడు; మెదల నియ్యడు. నరులను సురలను చిత్రహింసలు పెడుతున్నాడు. రామభద్రా ! రక్షకులైన మీకు ఆ లవణాసురుని దుండగాలు నివేదించడానికి వచ్చాము. లవణసముద్రం బంధించి పుత్ర మిత్ర బాంధవ సహితంగా రావణాసురుణ్ణి వధించిన మీకు లవణుడొక లక్ష్యమా? ప్రభూ ! ఈ దుష్టుని శిక్షించి శిష్టుల రక్షించు'' మని పల్కి విరమించాడు.

అంతట రాఘవుడు మౌనులతో ''మహాత్ములారా ! మీరిక నిశ్చింతగా వెళ్ళండి. లవణాసురుణ్ణి హతమార్చి మీ ఆర్తిని తొలగిస్తాను'' అని చెప్పి వారిని సాగనంపినాడు.

ఆ తరువాత శత్రుఘ్నునితో ''లవణుని పరిమార్చుటకు నిన్ను పంపుతున్నాను. వైరిని వధించి వాని రాజ్యాన్ని పరిపాలించు'' అంటూ మధుపురికి తన తమ్ముణ్ణి అప్పుడే అభిషిక్తుణ్ణి చేశాడు.

శత్రుఘ్నుడు సేనానివహంతో బయలుదేరినాడు. మూడు దినాలు పయనించి గంగానదిని చేరాడు. గంగాతీరంలో సేనలు విడియించి వాల్మీకి మహర్షి ఆశ్రమం సందర్శించాడు. వాల్మీకి మహర్షికి తాను రాముని తమ్ముడైన శత్రుఘ్నుడనీ, అన్న పనుపున లవణాసురసంహారానికి వచ్చాననీ, ఈ రాత్రి మీ ఆశ్రమంలో నివసించి వేకువనే వెళతాననీ విన్నవించుకున్నాడు. వాల్మీకి సంతోషించి అతనికి ఆరగించడానికి ఫలమూలాదులిచ్చి ఆదరించాడు. ఆ రాత్రి జానకీదేవి కుశలవులను కనింది. తల్లీబిడ్డలు క్షేమంగా వున్నారని మహర్షి ఆ శుభవార్త శత్రుఘ్నుని

చెవిలో వేశాడు. ఎంతో సంతోషించి తెల్లవారగనే అతడు మునియాజ్ఞవడసి అక్కడనుంచి పయనించి యమునానదిని చేరుకున్నాడు.

యమునలో స్నానమాడి శత్రుఘ్నుడు చ్యవనమహర్షిని సందర్శించాడు. ఆ రేయి చ్యవనాశ్రమంలో విశ్రమించిన శత్రుఘ్నుడు మునీంద్రునితో ఇలా అన్నాడు.

''మహాత్మా ! లవణాసురుడు మహావీరుడని మీరానాడు ప్రభువైన శ్రీరామచంద్రునితో అన్నారు. శివదత్తమైన శూలంతో అతడెవరినైనా సంహరించాడా ? చెప్పండి.''

అందుకు చ్యవనమహర్షి ''శత్రుఘ్నా! లవణాసురుని శూలంతో హతులైన రాజులిందరందరని చెప్ప శక్యం కాదుసుమా ! మాంధాతృ చక్రవర్తి లవణుని శూలంతోనే మరణించాడు. ధైర్యంలో మేరుపర్వతం వంటి మాంధాత పుడమిలోగల రాజులందరినీ ఓడించారు. దేవేంద్రుణ్ణి కూడ ఓడించుటకు స్వర్గముపై దండెత్తినాడు. ప్రతాపశాలియైన మాంధాతను జయించడం అశక్యమని సురపతి భావించి ''రాజోత్తమా! భువిలోని రాజులందరినీ జయించి కదా దివిపైకి రావలె ? మధుపుత్రుడైన లవణాసురుడు నీకజేయుడైయుండగా మా మీదికెలా వచ్చావు ?'' అని పల్కినాడు. ఆ మాటలకు మాంధాత సిగ్గుపడి ''లవణుని నిర్జించిన తరువాతనే మీపని పడతాను'' అంటూ అక్కడనుంచి మధుపురికి దండుతో కదలివచ్చాడు. ద్వారముకడ నిలిచి దూతను లోనికి పంపినాడు. కుపితుడైన లవణుడు దూతను హతమార్చాడు. మాంధాత కొలువులోనికేగి ''దనుజాధమా ! నాతో పోరుకు రమ్మ''ని పిలిచాడు. మదగజాన్ని ఎదిరించే సింహం మాదిరి గర్జిస్తూ లవణుడు అతనిపై శూలం విసిరాడు. ఆ శూలం నుంచి వెలువడిన అగ్నిశిఖలలో ససైన్యంగా మాంధాత మాడిపోయాడు. శత్రుఘ్నా! లవణుడు శూలం ధరించియున్నవేళ

తలపడవద్దు. రేపు నీవు అనిలో లవణుని హరిస్తావు. నేడు మా యాశ్రమంలో నిదురించి రేపు పయనం కమ్మని మౌని పలికినాడు. చ్యవనాశ్రమంలో శత్రుఘ్నుడు ఆ రాత్రి గడపి తెల్లవారగనే యమునానదిని దాటి మధుపురికి చేరాడు.

**శత్రుఘ్నుడు లవణుని సంహరించుట :**

శత్రుఘ్నుడు ఊరువెలుపల సేనలతో నిల్చి లవణుని రాకకై వేచియున్నాడు. లవణాసురుడు ప్రొద్దు పొడువకమునుపే వేటకు వెడలి వధించిన వరాహాది మృగాలతో మధ్యాహ్న వేళ నగరిలో ప్రవేశింపబోతున్నాడు. శత్రుఘ్నుడు అతణ్ణి అక్కడే నిల్వరించి ''ఓరీ! నీతో యుద్ధానికి వచ్చాను. నేను శ్రీరాముని తమ్ముణ్ణి; శత్రుఘ్నుణ్ణి. వీరుడవైతే నన్నెదిరించు'' అంటూ అతనిపై శరవర్షం కురిపించాడు. లవణుడు క్రోధంతో కళ్ళనుంచి చిటపట నిప్పులు రాలుతుండగా శూలంకోసం పురిలో చొచ్చుటకు సకలయత్నాలు చేశాడు. శత్రుఘ్నుడు వాటినన్నింటినీ వమ్ముచేసి అన్నగారు తనకిచ్చిన అమోఘాస్త్రంతో వాణ్ణి సంహరించాడు. లోకకంటకుడైన లవణుని నిర్మూలించిన శత్రుఘ్నునిమీద దేవతలు పూలవాన కురిపించారు.

భృగువంశసంజాతుడూ, మహాతపోధనుడూ, యోగమహిమాఢ్యుడూ, లోకోపకారకుడూ అయిన చ్యవనమహర్షి ఋషిమండలంలో చుక్కల్లో చంద్రునివలె తేజరిల్లుతున్నాడు.

***ఓం శాంతిః శాంతిః శాంతిః***

● ● ●

TIRUMALA TIRUPATI DEVASTHANAMS

CENTENARY CELEBRATIONS OF SRI VENKATESWARA VEDA PATHASALA

DHARMAGIRI

&

VEDA AGAMA SILPA SADAS

5-7-1999 To 8-7-1999